ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రంగారెడ్డి
5 జిల్లా వార్తలు
సోమవారం 25 మార్చి 2024



రంజాన్ వేళలు
ఇఫ్తార్ - సోమవారం
సాయంత్రం - 6:34
సహర్ - మంగళవారం
ఉదయం - 4:54



ఆమనగల్లులో రంగుల అమ్మకాలు

రంగుల పండుగకు రెడీ

నేడే హోలీ...

రంగుల పండుగ హోలీ వేడుకలను ఉత్సాహంగా జరుపుకునేందుకు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రజలు సన్నద్ధమయ్యారు. కుల మతాలకతీతంగా అందరూ రంగులు చల్లుకోనున్నారు. సోమవారం హోలీ పండుగ నేపథ్యంలో యువతీ యువకులు, చిన్నారులు రంగులు కొనుగోలు చేశారు. నేడు హోలీ పండుగ కావడంతో ఒక రోజు ముందే విద్యార్థులు మోదుగ చెట్ల నుంచి పూలను సేకరించి వాటికి పసుపు కలిపి రంగు తయారు చేసి పెట్టుకున్నారు. సహజ సిద్ధ రంగులతో ఆదివారం కొన్ని చోట్ల హోలీ వేడుకను జరుపుకున్నారు.

- రంగారెడ్డి అర్బన్, మార్చి 24





కందుకూరులో కామదహనం



కడ్తాలలో కామదహనం

మరో నెలన్నర రోజుల్లో జరగనున్న లోక్‌సభ ఎన్నికలకు ఇప్పటి నుంచే ప్రధాన పార్టీలు సమాయత్తం అవుతున్నాయి. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్‌లు తమ అభ్యర్థులను ఖరారు చేశాయి. ఉమ్మడి జిల్లాలోని చేవెళ్ల, మాల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గాల్లో గెలుపే లక్ష్యంగా పార్టీలు సమావేశాలు నిర్వహిస్తూ తమ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నేతలతో మంతనాలు సాగిస్తున్నాయి. ఎంపీ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చిస్తున్నాయి. ఈ రెండు స్థానాల్లో గెలుపును మూడు పార్టీలూ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్నాయి. ఇప్పటి నుంచే ప్రచారం, ఎదుటి పార్టీల్లో అసమ్మతి నేతలపై దృష్టిపెట్టడం, తమ ప్రభుత్వాలు చేసిన ప్రజాహిత కార్యక్రమాలపై ప్రచారాన్ని ముమ్మరం చేస్తున్నాయి.



చేవెళ్ల అభ్యర్థులు

కాసాని జ్ఞానేశ్వర్

రంజిత్‌రెడ్డి

కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

వ్యూహం సిద్ధం!

ఎన్నికల కదనరంగంలోకి పార్టీలు

- అభ్యర్థుల ఖరారుతో వేగంగా ప్రచారం
- ప్రత్యర్థి పార్టీల్లో అసమ్మతులపై ప్రధానంగా గురి
- చేవెళ్ల, మల్కాజిగిరిల్లో నెలకొన్న త్రిముఖ పోటీ

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి)

పార్లమెంట్ ఎన్నికలకు ప్రధాన రాజకీయ పార్టీలన్నీ వ్యూహాలను సిద్ధం చేసుకుంటున్నాయి. ఎన్నికల షెడ్యూల్ విడుదలతో ఉమ్మడి జిల్లా పరిధిలోని రెండు లోక్‌సభ స్థానాల్లో అభ్యర్థులను ఖరారు చేసిన పార్టీలు పూర్తిస్థాయిలో ఎన్నికల కదనరంగంలోకి దిగాయి. క్షేత్రస్థాయిలో నియోజకవర్గ, మండల స్థాయిల్లో కేడర్‌ను సమాయాత్తం చేస్తున్నాయి. స్థానిక నాయకులు, కార్యకర్తలు, వివిధ సంఘాలతో సభలు, సమావేశాలు నిర్వహిస్తున్నాయి. ప్రత్యర్థి పార్టీల్లోని అసమ్మతి నాయకులను తమవైపునకు తెచ్చుకునేయత్నం చేస్తున్నాయి. ఎన్నికలకు ఇంకా సమయం ఉండడంతో ఇప్పటి నుంచే వ్యూహాత్మకంగా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తున్నాయి. అన్ని పార్టీలు సోషల్ మీడియా గ్రూపులు ఏర్పాటు చేసి తమ అభ్యర్థులు, నేతల ప్రచారాలను ఎప్పటికప్పుడు వాట్సాప్, ఇన్‌స్టగ్రామ్, ఫేస్బుక్, యూ ట్యూబ్, ఎక్స్(ట్విటర్) తదితర సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో చేరవేస్తూ ఓటర్లను చేరుకునే యత్నం చేస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలోని చేవెళ్ల, మల్కాజిగిరి పార్లమెంట్ స్థానాలకు మే 13న ఎన్నికలు జరగనున్న విషయం తెలిసిందే. రాష్ట్రంలోని కీలకమైన ఈ రెండు నియోజకవర్గాలను దక్కించుకునేందుకు అధికార కాంగ్రెస్‌తో పాటు ప్రధాన ప్రతిపక్షం బీఆర్‌ఎస్, బీజేపీలు పోటీపడుతున్నాయి. గత అసెంబ్లీ ఎన్నికల తరువాత మారిన రాజకీయ పరిస్థితుల కారణంగా చేవెళ్ల, మల్కాజిగిరిల్లో త్రిముఖ పోటీ నెలకొంది. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన ఓట్లను పరిశీలిస్తే రెండు స్థానాల్లో బీఆర్‌ఎస్‌కు గణనీయమైన ఆధిక్యత స్పష్టంగా కన్పిస్తోంది. అయితే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత రాజకీయ పరిస్థితులు ఒక్కసారిగా మారాయి. బీఆర్‌ఎస్ పరిస్థితి రోజురోజుకూ తీసికట్టుగా తయారవుతోంది. ఆ పార్టీలోని కీలక నేతలంతా అధికార పార్టీలో చేరేందుకు క్యూ కడుతున్నారు. ఉమ్మడి జిల్లా రాజకీయాలను శాసించిన కొందరు నేతలు ఇప్పటికే కాంగ్రెస్‌లో చేరగా మరికొందరు రానున్న ఎన్నికల్లోగా కాంగ్రెస్ కండువా కప్పుకునేందుకు సిద్ధం అయ్యారు. ఇప్పటికే వికారాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జడ్పీ ఛైర్‌పర్సన్లు, చేవెళ్ల ఎంపీ, ఓ మాజీ మంత్రి కాంగ్రెస్‌లో చేరారు. వీరిలో చేవెళ్ల సిట్టింగ్ ఎంపీ రంజిత్‌రెడ్డికి కాంగ్రెస్ చేవెళ్ల లోక్‌సభ టికెట్ సీటు ఖరారైంది. వికారాబాద్ జడ్పీఛైర్‌పర్సన్ సునీతారెడ్డికి మల్కాజిగిరి సీటు కేటాయించారు. అయితే రంజిత్‌రెడ్డి పార్టీలో చేరకముందు సునీతారెడ్డికే చేవెళ్ల కేటాయిస్తారని అంతా భావించారు. ఈ మేరకు ఆమె నియోజకవర్గంలో ప్రచారాన్ని కూడా మొదలు పెట్టారు. చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరడంతో ఈ సీటు ఆయనకే కేటాయించారు. ఈ విషయంలో సునీతారెడ్డి మనస్తాపం చెంది మల్కాజిగిరిలో పోటీకి నిరాకరించారు. పార్టీ నాయకత్వం బుజ్జగింపుల తరువాత ఆమె మల్కాజిగిరిలో పోటీకి ఒప్పుకున్నారు. దీంతో పాలక పార్టీ కాంగ్రెస్ అభ్యర్థులిద్దరూ చేవెళ్ల, మల్కాజిగిరిల్లో పూర్తిస్థాయిలో ప్రచార కార్యక్రమాలను మొదలుపెట్టారు.

ప్రచారంలో ముందున్న కమలదళం

ఇదిలా ఉంటే అందరికంటే ముందే టికెట్లు ఖరారు చేసిన బీజేపీ ప్రచారంలో దూసుకుపోతోంది. మల్కాజిగిరి నుంచి మాజీ మంత్రి ఈటల రాజేందర్, చేవెళ్ల నుంచి ఇదే స్థానంలో ఎంపీగా పనిచేసిన కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని బీజేపీ బరిలో నిలిపింది. బీజేపీ ఇంటింటి ప్రచారాన్ని ముమ్మరం చేసింది. మిగతా రెండు పార్టీలతో పోలిస్తే బీజేపీకి క్యాడర్ తక్కువే ఉన్నా ఉన్నవారినే సమర్థంగా వాడుకుంటూ సభలు, అంతర్గత సమావేశాలతో పార్టీ విధానాన్ని ప్రజల్లోకి తీసుకుపోతోంది. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను విస్తృతంగా ప్రచారం చేస్తోంది. దేశానికి మరోసారి మోదీ అవసరం అంటూ నొక్కి చెబుతూ బీజేపీకి ఓటు వేయాలని కోరుతోంది. బీజేపీ శ్రేణులతో పాటు ఆర్‌ఎస్‌ఎస్ అనుబంధ సంస్థలు ఈ రెండు స్థానాల్లో గెలుపు కోసం చాపకింద నీరులా పనిచేస్తున్నాయి. నాయకులు స్థానికంగానే బసచేస్తూ క్షేత్రస్థాయిలో ముమ్మర ప్రచారం చేస్తున్నారు. కార్నర్ మీటింగ్‌లు, పాదయాత్రలు, పల్లె నిద్ర కార్యక్రమాలతో పార్టీని ప్రజల్లోకి తీసుకుపోతున్నారు.

ఎట్టకేలకు అభ్యర్థులను ఖరారు చేసిన బీఆర్‌ఎస్

ఇక ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్‌ఎస్ చేవెళ్ల నుంచి రంగారెడ్డి జడ్పీ మాజీ ఛైర్మన్ కాసాని జ్ఞానేశ్వర్‌ను బరిలో దింపింది. అలాగే మల్కాజిగిరి నుంచి సీనియర్ నేత రాగిడి లక్ష్మారెడ్డి పేరు ఖరారు చేసింది. ఈ స్థానం నుంచి మొదట ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుకు టికెటిస్తారని ప్రచారం జరిగింది. చివరి నిమిషంలో ఇక్కడ అభ్యర్థిని మార్చారు. బీఆర్‌ఎస్ కూడా రెండు స్థానాల్లో ప్రచారాన్ని మొదలు పెట్టింది. రెండు లోక్‌సభ నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, నేతలతో అభ్యర్థులు ఇప్పటికే సమావేశాన్ని నిర్వహించి ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు. అయితే నిన్నమొన్నటి వరకూ గెలుపుపై ధీమాతో ఉన్న బీఆర్‌ఎస్‌కు రోజుకో దెబ్బతగులుతోంది. పార్టీ ముఖ్యనేతలంతా ఒకొక్కరుగా పార్టీని విడిచి కాంగ్రెస్‌లో చేరుతుండడంతో ఆ పార్టీ ప్రచారంపై ప్రభావం పడుతోంది. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు కొందరు ఇప్పటికే అధికార పార్టీకి దగ్గరయ్యారు. మరి కొందరు బయటపడకున్నా బీఆర్‌ఎస్ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. కొద్ది రోజుల్లో నగర శివారుల్లోని నియోజకవర్గాల ఎమ్మెల్యేల్లో ఎక్కువ మంది కాంగ్రెస్‌లో చేరుతారంటూ జోరుగా ప్రచారం సాగుతోంది. కొన్ని రోజుల క్రితం రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. ఇంకా మరికొందరు కాంగ్రెస్‌తో టచ్‌లో ఉన్నారు. అయితే ఇటీవల బీఆర్‌ఎస్ నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ మాట్లాడుతూ తాను బీఆర్‌ఎస్ పార్టీని వీడేది లేదన్నారు. పార్టీ ఇప్పుడు కష్టాల్లో ఉందని, ఈ సమయంలో పార్టీ అధినేత కేసీఆర్‌కు మనమంతా అండగా ఉండాలంటూ పేర్కొన్నారు. అయితే పార్టీ మారకుండా ఉండే నేతలు ఎంత మంది అనేది రానున్న రోజుల్లో తేలనుంది.



మల్కాజిగిరి అభ్యర్థులు

సునీతారెడ్డి

రాగిడి లక్ష్మారెడ్డి

ఈటల రాజేందర్



అర్ధరాత్రి ఆక్రమణల కూల్చివేత

ప్రభుత్వ భూమిలో ఆక్రమణల తొలగింపు

మహేశ్వరం, మార్చి 24 : మండల పరిధిలోని మన్‌సాన్‌పల్లి సర్వే నంబర్ 140 లోని ప్రభుత్వ భూమిలో అక్రమంగా కట్టిన గోడలను శనివారం రాత్రి రెవెన్యూ అధికారులు జేసీబీలతో కూల్చివేశారు. ఆర్డీవో సూరజ్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ భూములను కబ్జాచేస్తే ఉపేక్షించేదిలేదని, క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని అన్నారు. అన్ని గ్రామాల్లో ప్రభుత్వ భూములను గుర్తించి వాటిల్లో బోర్డులు ఏర్పాటు చేసి పరిరక్షిస్తామన్నారు. ప్రభుత్వ భూములను ఆక్రమించినా, నిర్మాణాలు చేపట్టినా వాటిని తొలగించి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుటంటామని ఈ సందర్భంగా ఆర్డీవో హెచ్చరించారు.

బీజేపీ గూటికి పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి

షాద్‌నగర్ అర్బన్, మార్చి 24: ఆల్ ఇండియా ఫార్వార్డ్ బ్లాక్ నాయకుడు విష్ణువర్ధన్‌రెడ్డి తిరిగి బీజేపీలో చేరారు. నగరంలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి ఆయనకు కండువా కప్పి ఆహ్వానించారు.మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ గెలుపు కోసం కృషిచేయాలని కిషన్‌రెడ్డి సూచించారు. అసెంబ్లీ ఎన్నికల్లో విష్ణువర్ధన్‌రెడ్డి షాద్‌నగర్ నుంచి ఫార్వార్డ్ బ్లాక్ అభ్యర్థిగా పోటీ చేసి 31,670ఓట్లు సాధించారు. ఎన్నికల్లో తనకు టికెట్ ఇవ్వకపోయినా నరేంద్రమోదీ చేస్తున్న కృషికి అండగా నిలవాలనే తిరిగి బీజేపీలో చేరానని విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు.



కండువా కప్పుతున్న కిషన్‌రెడ్డి



మరియపురంలో ప్రార్థనలు నిర్వహిస్తున్న క్రైస్తవులు

ఘనంగా పామ్ సండే

షాబాద్, మార్చి 24 : మండల పరిధిలోని మరియపురం గ్రామంలో పామ్ సండేను ఘనంగా జరుపుకున్నారు. ఉదయం చర్చిలో ప్రార్థనలు చేసిన అనంతరం గ్రామంలో తాటి కొమ్మలతో తిరిగారు. ఈ సందర్భంగా ఫాదర్లు మాట్లాడుతూ క్రైస్తవ సంప్రదాయంలో ఈస్టర్ ముందు వచ్చే ఆదివారం పామ్ డేను నిర్వహిస్తామన్నారు. పామ్ సండే అనేది తాటికొమ్మలు లేదా ఇతర స్థానిక చెట్ల కొమ్మలను ఆశీర్వదించడం, పంపిణీ చేయడం అని తెలిపారు.

అసైన్డ్ భూములపై అధికారుల నజర్

- ప్రభుత్వ ఆదేశాలతో మొండిగౌరెల్లిలో అసైన్డ్ భూముల సర్వే
- పారదర్శకంగా సర్వే చేస్తాం : ఆర్డీవో

యాచారం, మార్చి 24 : మండలంలోని మొండిగౌరెల్లిలో అసైన్డ్ భూములను స్వాధీనానికి టీఎస్‌ఐఐసీ అధికారులు రెవెన్యూ అధికారులతో సర్వే చేయిస్తున్నారు. ఈ భూముల్లో డ్రోన్ పోర్ట్, ఇతర కంపెనీ ఏర్పాటుకు టీఎస్‌ఐఐసీ దృష్టిసారించింది. కాగా ఈ భూములను 10మంది సర్వేయర్లతో సర్వే చేసేందుకు అధికారులు నిర్ణయించారు. గ్రామంలో సర్వే నంబర్ 2లో ఎకరం భూమిని అసైన్డ్‌దిగా తేల్చారు. 19 సర్వే నంబర్‌లో 400 ఎకరాలను అసైన్డ్ ల్యాండ్‌గా తేల్చారు.



మొండిగౌరెల్లి 19 సర్వే నంబర్‌లో సాగవుతున్న వరి

అలాగే 68 సర్వే నంబర్‌లో 203 ఎకరాలు అసైన్ చేశారు. 107సర్వే నంబర్‌లో 2ఎకరాల 8గుంటలు, సర్వే నంబర్‌లో 127లో 108 ఎకరాల 30గుంటలు, సర్వే నంబర్ 163లో 2ఎకరాల 25గుంటల, సర్వే నంబర్ 169లో 16గుంటలు.. ఇలా మొత్తం 716ఎకరాల 14గుంటల భూమిని అసైన్డ్ ల్యాండ్‌గా తేల్చారు. ఈ భూమిని గతంలో ప్రభుత్వం ఎంత మంది రైతులకు కేటాయించిందో వివరాలు సేకరిస్తున్నారు. భూమి కేటాయించిన వారిలో ఎందరు కాస్తులో ఉన్నారు? ఎన్ని ఎకరాలు వృథాగా ఉంది? వీటిల్లో రైతులు ఏ పంటలు సాగు చేస్తున్నారు? అసైన్డ్ భూములను రైతులు ఇప్పటికే ఎవరికైనా విక్రయించారా? తదితర వివరాలను అధికారులు సేకరిస్తున్నారు. భూముల వివరాలను సమగ్రంగా ఇవ్వాలని టీఎస్‌ఐఐసీ అధికారులు రెవెన్యూ అధికారులను కోరడంతో పది మంది సర్వేయర్లతో సర్వే చేయిస్తున్నారు. కొన్ని రోజుల్లోగా సర్వే పూర్తి చేయగానికి అధికారులు యత్నిస్తున్నారు. అలాగే రికార్డుల్లో లేకుండా క్రమించిన వారి వివరాలనూ రెవెన్యూ అధికారులు తేల్చుతున్నారు. గతంలో కొందరు రెవెన్యూ అధికారులను మచ్చిక చేసుకొని అసైన్‌మెంట్ కమిటీ లేకుండానే తప్పుడు సర్టిఫికెట్లు సృష్టించినట్లు తెలుస్తోంది. దీంతో పహాణీల్లో ఎక్కించుకొని ధరణిలో నమోదు చేయించుకున్నట్లు తెలిసింది. కాగా 127 సర్వే నంబర్‌లో ఉన్న 122 ఎకరాల్లో మొత్తం భూమిని ఆక్రమించి ధరణిలో ఎక్కించుకున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఆక్రమణల్లో కొందరు 58, 59జీవోల కింద ఇంటి నిర్మాణాలకు యత్నిస్తున్నట్లు సమాచారం. గతంలో ఇక్కడ ఇల్లు నిర్మించగా అప్పటి తహసీల్దార్ సుచరిత కూల్చివేయించడం గమనార్హం. భూమి పక్కనే సెంచరీ గార్డెన్‌ను నెలకొల్పడంతో ఈ భూమికి భారీ డిమండ్ ఉంది. ఈ భూమిని సర్వే చేసి కబ్జా చేయకుండా హద్దులు పాతాలని స్థానికులు రెవెన్యూ అధికారులను కోరుతున్నారు. గతంలో అధికారులు పట్టించుకోకే కబ్జా చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం గతంలో పంచిన పట్టాసర్టిఫికెట్ల ఆధారంగానే లబ్ధిదారులను గుర్తించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

టీఎస్‌ఐఐసీ ఆదేశాలతో సర్వే చేయిస్తున్నాం



మొండిగౌరెల్లిలోని అసైన్డ్ భూములను సమగ్రంగా సర్వే చేస్తాం. టీఎస్‌ఐఐసీ ఆదేశం మేరకు సర్వే వివరాలను వారికి అందజేస్తాం. ఇక్కడ డ్రోన్‌పోర్ట్ కోసం 10 ఎకరాలు సరిపోతుంది. ఇంకా ఏయే కంపెనీలు ఏర్పాటు చేస్తారో టీఎస్‌ఐఐసీకే తెలియాలి. భూమి అందుబాటులో ఉంటూ విదేశీ కంపెనీలు కూడా ఏర్పాటయ్యే అవకాశం ఉంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు మేం సమగ్రంగా సర్వే నిర్వహిస్తున్నాం.

- అనంతరెడ్డి, ఆర్డీవో, ఇబ్రహీంపట్నం



తిరు కల్యాణోత్సవాల్లో రథాన్ని లాగుతున్న భక్తులు

ఘనంగా వేంకటేశ్వరస్వామి తిరు కల్యాణోత్సవం

ప్రసిద్ధ శ్రీనగర్ శ్రీఆదిలక్ష్మీ అలివేలుమంగ సమేత శ్రీ బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో తిరు కల్యాణోత్సవాన్ని శనివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా నిర్వహించిన రథోత్సవాన్ని తిలకించేందుకు తుక్కుగూడ, మహేశ్వరం, కందుకూరు మండలాలతో పాటు నగర శివారుప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. మాజీ హోం మంత్రి టి.దేవేందర్‌గౌడ్ కుటుంబీకులు, భక్తజన సందోహం మధ్య రథోత్సవాన్ని నిర్వహించారు. 110 సంవత్సరాల చరిత్ర గల ఈ ఆలయంలో స్వామి వారి రథోత్సవం వైభవోపేతంగా జరిగింది. ఉత్సవాల ఏర్పాట్లను బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి టి.వీరేందర్‌గౌడ్, ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలు జగన్నాథచార్యులు, సింహాచార్యులు పర్యవేక్షించారు. పూజల్లో టి.దేవేందర్‌గౌడ్, విజయేందర్‌గౌడ్, వీరేందర్‌గౌడ్, మధుమోహన్‌గుప్తా, తుక్కుగూడ మున్సిపల్ ఛైర్మన్ మధుమోహన్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

- మహేశ్వరం, మార్చి 24

ప్రజల సహకారంతోనే సమాజంలో శాంతి


- నాదర్‌గుల్‌లో పోలీసుల ఫ్లాగ్ మార్చ్

ఆదిభట్ల, మార్చి 24: ప్రజల సహకారం, సహనాల వల్లే సమాజంలో శాంతియుత వాతావరణం నెలకొంటుందని ఆదిభట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి అన్నారు. లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా ఆదివారం బాలాపూర్ మండలం నాదర్‌గుల్‌లో కేంద్ర బలగాలు, రాష్ట్ర పోలీసులు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించాయి. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ వచ్చే పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రజలు పోలీసులకు, అధికారులకు సహకరించాలని కోరారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సైలు రాజు, బాలరాజు, సీఎస్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.



నాదర్‌గుల్‌లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు





రాష్ట్ర పోలీసు గృహ నిర్మాణ సంస్థ చైర్మన్‌కు సన్మానం

కొడంగల్ రూరల్, మార్చి 24: తెలంగాణ రాష్ట్ర పోలీసు గృహ నిర్మాణ సంస్థ చైర్మన్ కొడంగల్ మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డిని కొడంగల్ మండలంలోని టేకుల్‌కోడ్ గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సన్మానించారు. వారు ఆదివారం కొడంగల్‌లో గురునాథ్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువా, పూలమాలలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది వెంకటయ్య, మాజీ సర్పంచ్ లక్ష్మీనాయక్, దుబ్బ భీమ్‌రెడ్డి, ఆకుల మల్లికార్జున్, దుప్‌చర్ల శేఖర్, చింతకింది రాజు, పి.అంజిలప్ప, బుర్రి కిష్టప్ప, రాంచందర్, కంతి చంద్రప్ప, చింతకింది నర్సింహులు, మాల రాములు, నర్సింహులు పాల్గొన్నారు.



గురునాథ్‌రెడ్డిని సన్మానిస్తున్న టేకుల్‌కోడ్ గ్రామ కాంగ్రెస్ నాయకులు

రోడ్డు భద్రతపై వాహనదారులకు అవగాహన



కొడంగల్ అంబేడ్కర్ చౌరస్తాలో అవగాహన కల్పిస్తున్న పోలీసులు

కొడంగల్, మార్చి 24: వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై ఎస్‌ఐ భరత్‌రెడ్డి ఆదివారం కొడంగల్ అంబేడ్కర్ చౌరస్తాలో అవగాహన కల్పించారు. హెల్మెట్ వాడకం, సైబర్ నేరాలు, రోడ్డు భద్రత తదితర వాటిపై సలహాలు, సూచనలు చేశారు. ప్రతీ వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.






















వెటరన్స్ క్రికెట్ రన్నరప్ రంగారెడ్డి రాయల్స్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): వెటరన్స్ క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ (వీసీఏటీ) ఆధ్వర్యంలో నిర్వహించిన మాస్టర్స్ ప్రీమియర్ లీగ్ (ఎంపీఎల్)లో రంగారెడ్డి రాయల్స్ జట్టు రన్నరప్‌గా నిలిచింది. ఆదివారం అజీజ్‌నగర్‌లో జరిగిన ఎంపీఎల్ ఫైనల్లో తొలుత బ్యాటింగ్ చేసిన హైదరాబాద్ జట్టు 5 వికెట్ల నష్టానికి 157 పరుగులు చేసింది. ఛేదనలో రంగారెడ్డి రాయల్స్ 7 వికెట్లు కోల్పోయి 119 పరుగులే చేసి పరాజయం పాలైంది. విజేత, రన్నరప్ జట్లకు హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు ట్రోఫీలను, నగదు బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెటరన్ క్రికెటర్లు వర్ధమాన, యువ క్రికెటర్లకు స్ఫూర్తిప్రదాతలని కొనియాడారు. ఎండ, వయసును



ట్రోఫీ ప్రదానం చేస్తున్న జగన్‌మోహన్

లెక్క చేయకుండా పోటాపోటీగా ఆడిన ఇరుజట్ల క్రికెటర్లను అభినందించారు. కార్యక్రమంలో వీసీఏటీ వ్యవస్థాపక సభ్యుడు కన్నన్, సురేంద్ర అగర్వాల్, ఎస్వీవై రెడ్డి, జితేంద్ర తదితరులు పాల్గొన్నారు.

'ప్రజాపాలన'లో అన్ని వర్గాలకు సమన్యాయం

ఆమనగల్లు, మార్చి 24: కాంగ్రెస్ ప్రజా పాలనలో అన్ని వర్గాలకు సమన్యాయం జరుగుతుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. పేదలకు మెరుగైన వసతుల కల్పనే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. ఆమనగల్లు, కడ్తాల, మాడ్గుల, తలకొండపల్లి మండలాలకు చెందిన నాయకులు, ప్రజాప్రతినిధులు ఆదివారం ఎమ్మెల్యేను నగరంలోని ఆయన నివాసంలో కలిశారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని, అభివృద్ధి పనులకు ప్రత్యేక నిధులు కేటాయించాలని ఎమ్మెల్యేకు వినతిపత్రాలు అందజేశారు. లోక్‌సభ ఎన్నికలు ముగియగానే సమస్యలు పరిష్కరిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు చెప్పారు. నల్లవారి పల్లి గ్రామానికి బీటీ రోడ్డు పనులు వెంటనే ప్రారంభించేలా చూడాలని గ్రామ కాంగ్రెస్ నాయకురాలు ఇటికాల జయమ్మ ఆధ్వర్యంలో స్థానిక నాయకులు ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలకు అనుగుణంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్కొక్కటిగా అమలు చేస్తుందన్నారు. నాయకులు యాదయ్య, శంకర్, మోతిలాల్, పర్వత్‌రెడ్డి, శేఖర్, రామస్వామి, చంద్రయ్య, మల్లేశ్, తదితరులున్నారు.


ఎమ్మెల్యే కసిరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న నల్లవారిపల్లి గ్రామస్తులు


కార్యక్రమంలో పాల్గొన్న పద్మజారాణి, రియాజ్, ఉమ, శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు

సైనిక్, మిలటరీ స్కూళ్లు.. దేశ మనుగడకు దోహదం

▸ డీఆర్డీవో పద్మజా రాణి

కీసర రూరల్, మార్చి 24 : దేశ మనుగడకు సైనిక్, రాష్ట్రీయ మిలటరీ స్కూళ్లు ఎంతగానో దోహదపడతాయని గ్రామీణాభివృద్ధి శాఖ కామారెడ్డి జిల్లా అధికారి పద్మజారాణి అన్నారు. ఆదివారం దమ్మాయిగూడ మున్సిపాలిటీలోని క్రాంతికీన్ పాఠశాలలో విన్నర్ మీట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పీసీసీ అధికార ప్రతి ప్రతినిధి డాక్టర్ రియాజ్, ఎన్‌సీఈఆర్టీ సభ్యురాలు ఉమ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా క్రాంతికీన్ స్కూల్ నుంచి జాతీయ స్థాయిలో ర్యాంకులు సాధించిన విద్యార్థులకు వారు జ్ఞాపికలు అందజేసారు. అనంతరం వారు మాట్లాడుతూ సైనిక్, రాష్ట్రీయ మిలటరీ స్కూళ్లలో విద్యనభ్యసించిన విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. దేశ ప్రగతి, భద్రతలో వారు భాగస్వాములు కావటంతో చరితార్థులు అవుతారని అన్నారు. సైనిక్, రాష్ట్రీయ మిలటరీ పాఠశాలల్లో ప్రవేశం పొందేందుకు ఉత్తమమైన శిక్షణ ఇస్తున్న క్రాంతికీన్ పాఠశాల యాజమాన్యాన్ని వారు అభినందించారు. పాఠశాల కరెస్పాండెంట్ శ్రీనివాస్‌రెడ్డి, ప్రిన్సిపాల్ కళ్యాణి, గ్రేటర్ కాలేజ్ కళాశాల ప్రిన్స్‌పాల్ డాక్టర్ వెంకటేష్, బోధనా సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.


వినతి పత్రం ఇస్తున్న కాటికాపర్ల సంఘం నాయకులు

కాటికాపరుల సమస్యలు పరిష్కరించాలి

కందుకూరు, మార్చి 24 : కుల వృత్తినే నమ్ముకున్న మాల బ్యాగరి కాటికాపరుల సమస్యలను పరిష్కరించాలని ఆ సంఘం జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎత్తపు కేశవులు కోరారు. ఆదివారం ఆ సంఘం నేతలతో కలిసి నగరంలోని మాజీ ఎంపీ, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు డాక్టర్ మల్లు రవి నివాసానికి వెళ్లి మర్యాదపూర్వకంగా కలిసి ఆయనను ఘనంగా సన్మానించారు. అనంతరం వారి సమస్యలపై ఆయనకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కేశవులు మాట్లాడుతూ మాలబ్యాగరి కాటికాపర్ల సమస్యలను కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో పొందుపర్చాలని కోరారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో శ్మశానవాటికల్లో సేవలందిస్తున్న తమ సమస్యలపై పాలకులు నేటికి నిర్లక్ష్యం చేస్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. శ్మశానవాటికల్లో మౌలిక వసతులను కల్పించి ప్రతి నెల రూ.25వేలు వేతనంగా ప్రభుత్వం ఇవ్వాలన్నారు. ప్రమాదవశాత్తు మరణించిన కాటికాపరులకు హెల్త్ కార్డు, జీవిత భీమా ద్వార రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా వచ్చేల కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు గాదె సత్తయ్య, నాయకులు జి.శేఖర్, కె.గణేష్, కె.నాగరాజు, బి.సురేందర్, బి.రాజు, జి.సుధాకర్, టి.నర్సింహ, కె.మోహన్, పాల్గొన్నారు.


ప్రవీణ్‌కుమార్‌ను సన్మానిస్తున్న వెంకటేశ్, నాయకులు

లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం ఖాయం

▸ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

ఆమనగల్లు, మార్చి 24: పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం ఖాయమని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్‌ను దెబ్బతీసేందుకు బీజేపీ, కాంగ్రెస్ కుట్ర రాజకీయాలు చేస్తున్నాయని ఆరోపించారు. ఆమనగల్లు పట్టణంలో ఆదివారం సాయంత్రం ప్రవీణ్‌కుమార్ పర్యటించారు. తలకొండపల్లి జడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్‌తో కలిసి ప్రవీణ్‌కుమార్ బీఆర్ఎస్ నాయకులతో సమావేశమయ్యారు. లోక్‌సభ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై నాయకులతో చర్చించారు. బీఆర్ఎస్ విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు వ్యూహాత్మకంగా ముందుకుసాగాలని సూచించారు. బీజేపీ, కాంగ్రెస్‌లను నమ్మి ప్రజలు మోసపోవద్దని సూచించారు. కేంద్రంలో బీజేపీ మరోసారి అధికారంలోకి వస్తే రాజ్యాంగానికి ప్రమాదమన్నారు. ప్రజలంతా బీఆర్ఎస్‌ను ఆదరించి గెలిపించాలని కోరారు. తనను ఆదరించి గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. నాయకులు కొమ్ము శ్రీనివాస్‌యాదవ్, దుడ్డు అంజనేయులు, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా ట్యాంకర్ల ద్వారా కర్ణాటక నుంచి డీజిల్ సరఫరా



మర్పల్లి, మార్చి 24: మర్పల్లి మండలం కర్ణాటక సరిహద్దు ప్రాంతం కావడంతో సంగారెడ్డి, హైదరాబాద్‌కు చెందిన పలువురు కొంత కాలం నుంచి అక్రమంగా డీజిల్‌ను సరఫరా చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలో కంటే కర్ణాటకలో డీజిల్ దర తక్కువగా ఉండటంతో మర్పల్లి మీదుగా కర్ణాటక రాష్ట్రం కుంచారం గ్రామం నుంచి దర్జాగా ప్రతీరోజు పదుల సంఖ్యలో అక్రమంగా డీజిల్ ట్యాంకర్‌లను తరలిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. కొందరు అక్రమార్కులు పెద్ద ట్యాంకర్‌ల ద్వారా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. దీంతో సరిహద్దు ప్రాంతాల యజమానులు ఇతర ప్రాంతాల నుంచి డీజిల్ తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పొంచిఉన్న ప్రమాదాలు!

▸ ప్రమాదకరంగా విద్యుత్ వైర్లు

▸ డీలాపడిన ఎల్టీ 11 కేవీ వెర్లు.. సరి చేయని విద్యుత్ సిబ్బంది

▸ ఇళ్లమధ్యనే ట్రాన్స్‌ఫార్మర్లు పట్టని అధికారులు


ఇంటికి ఆనుకొని ఉన్న స్తంభం, ఎల్టీ వైర్లు


చిన్నతూండ్లలో ఇళ్ల మధ్య ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

యాచారం, మార్చి 24: యాచారం మండలంలోని వివిధ గ్రామాలలో ఎల్టీ, 11కేవీ విద్యుత్ వైర్లు వేలాడుతూ ప్రమాదకరంగా మారాయి. చాలా చోట్ల ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ కంచెలు లేకపోవడంతో ప్రమాదాలకు నిలయంగా మారాయి. విద్యుత్ సమస్యలపై మండల సర్వసభ్యసమావేశంలో ఎంపీటీసీలు, సర్పంచులు ట్రాన్స్‌కో అధికారుల దృష్టికి తెచ్చినా సమస్యను తీర్చిన దాఖలాలు లేవు. చిన్నతూండ్లలో 20 రోజుల క్రితం ఇళ్ల మధ్యలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ నుంచి బంచ్ కేబుల్ తెగిపోయింది. స్థానికుడు రాములు గమనించి ఉండకపోతే నల్గురు విద్యార్థుల ప్రాణాలు గాలిలో కలిసేవి. ఇదే గ్రామంలో ఇంటికి ఆనుకొని ఉన్న ఎల్టీవైర్ తగిలి ఆరేళ్లక్రితం నర్సింహ అనే వ్యక్తి దుర్మరణం చెందారు. స్తంభం తొలగిస్తామని అప్పట్లో ట్రాన్స్‌కో అధికారులు చెప్పడమే గానీ ఇంత వరకూ తొలగించలేదు. గ్రామాల్లో పలు చోట్ల ఇళ్లకు అనుకుని అనుకొని ఎల్టీ వైర్లున్నాయి. వాటిని సరి చేయాలని అధికారులను కోరినా పట్టించుకోవడంల లేదని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మినరల్ వాటర్ భవనంపై, గ్రామపంచాయతీ భవనంపై నుంచి ఎల్టీ వైర్లను తొలగించాలని ట్రాన్స్‌కో అధికారులను కోరినా పట్టించుకోవడం లేదన్నారు. తాటిపర్తిలో ఇండ్లకు ఆనుకొని ఎల్టీ వైర్లున్నా వాటిని సరిచేయడం లేదని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. నందివనపర్తిలో పలు చోట్ల ఎల్టీ వైర్లు ప్రమాదకరంగా ఉన్నాయి. వాటిని తొలగించాలని పలు మార్లు పంచాయతీ సిబ్బంది అధికారులను కోరినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. చౌదర్‌పల్లిలో పలు చోట్ల ఎల్టీ వైర్లు ప్రమాదకరంగా ఉన్నాయి. మంగలి జగాల్, జైతారం చంద్రయ్య, కొంగరి జంగయ్యల ఇళ్ల సమీపంలో ఎల్టీ వైర్లు ప్రమాదకరంగా ఉన్నాయి. నజ్దిక్‌సింగారంలో రోడ్డు పక్కనే ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచేలేకపోవడంతో ఆవు చనిపోయింది. దీంతో రైతు సొంత డబ్బులతో ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ఫెన్సింగ్ వేశారు. పలు వీధుల్లో ఎల్టీ లైన్లు డీలాగా ఉన్నాయి. నందివనపర్తిలో 11కేవీ వైర్ల కింద ఎల్టీ లైన్లకు కర్ర సాయంతో వెర్లను బిగించారు. అంతేకాకుండా గ్రామంలో ట్రాన్స్‌ఫార్మర్లకు కంచెలు లేకుండా పోయాయి. మంతన్‌గౌరెల్లి, అయ్యవారిగూడ, కొత్తపల్లి, మాల్ తదితర గ్రామాల్లో ఎల్టీ లైన్లపరిస్థితి దయనీయంగా ఉందని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి డీలాగా ఉన్న విద్యుత్ వైర్లను సరిచేసి ప్రమాదాలు జరగకుండా చూడాలని కోరుతున్నారు.


నజ్దిక్‌సింగారంలో కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్

స్తంభం తొలగించాలి



ఇంటిపైన ఉన్న ఎల్టీ వైర్‌ను తొలగించాలని అధికారులను కోరుతున్నా పట్టించుకోవడం లేదు. ఈ వెర్లు తాకడంతో నా భర్త నర్సింహ చనిపోయాడు. అయినా అధికారులు సరిచేయడం లేదు. గ్రామంలో ఏ వీధిలో చూసినా వైర్లు చాలా ప్రమాదకరంగా ఉన్నాయి.

యశమోని కళమ్మ చిన్నతూండ్ల

మా దృష్టికి వచ్చిన సమస్యను తీరుస్తున్నా



చిన్నతూండ్ల, చౌదర్‌పల్లి, తాటిపర్తి, నజ్దిక్‌సింగారం, నందివనపర్తి తదితర గ్రామాల్లో అస్తవ్యస్తంగా ఉన్న ఎల్టీ వైర్లను, 11 కేవీ వైర్లను సరిచేశాం. కొద్ది రోజుల క్రితం కొత్తపల్లిలో నాలుగు స్తంభాలు వేసి ఎల్టీ, 11కేవీ వైర్లను సరిచేశాం. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా చూస్తున్నాం విద్యుత్ సమస్యలను నాదృష్టికి తెస్తే పరిష్కరిస్తాను.

సందీప్‌కుమార్, యాచారం ట్రాన్స్‌కో ఏఈ

ఆటో డ్రైవర్‌ను చితక బాదిన వడ్డీవ్యాపారిని శిక్షించాలి

తెలంగాణ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు దయానంద్

హైదరాబాద్, మార్చి24 (ఆంధ్రజ్యోతి):- వికారాబాద్ జిల్లా తాండూరులో వడ్డీ డబ్బులు చెల్లించలేదనే కారణంతో ఆటో డ్రైవర్‌ను ఇంటికి పిలిచి చితక బాదిన మ్యాదరి రవిని కఠినంగా శిక్షించాలని తెలంగాణ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు దయానంద్ డిమాండ్ చేశారు. ఇప్పటికే రవాణారంగంపైఆధారపడిన ఆటో డ్రైవర్లకు ఆదాయం లేక కుటుంబాలు పస్తులుంటున్నాయని ఆయనపేర్కొన్నారు.మహాలక్ష్మిమహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణంతో అంతంత మాత్రంగా ఉన్న ఆటో డ్రైవర్ల ఆదాయం మొత్తానికి మొత్తం తగ్గిపోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.కుటుంబ అవసరాలకు రాజీవ్‌కాలనీకి చెందిన ఆటో డ్రైవర్ బాలయ్య తాండూరు పట్టణం గాంధీనగర్‌కు చెందిన మ్యాదరి రవి వద్ద మూడునెలల క్రితం 5వేలు అప్పుతీసుకున్నారన్నారు. సకాలంలో వడ్డీతో సహా మొత్తం చెల్లించలేదనే కారణంతో ఇంటికి పిలిచి లాఠీతో చితక బాదుతూ మరో వైపు పిడిగుద్దులతో మానవత్వాన్ని మరిచి తీవ్రంగా హింసించిన సంఘటనలు సామాజిక మాధ్యంలో వైరల్ అయిన దృశ్యాలు ప్రతి ఒక్కరినీ కదిలించాయని పేర్కొన్నారు. పేద ఆటో డ్రైవర్‌లపైపాశవిక దాడికి పాల్పడిన వడ్డీ వ్యాపారి రవిని తక్షణం అరెస్టు చేసి చట్టప్రకారం కఠినంగా శిక్షించాలని దయానంద్‌కోరారు. గ్రేటర్‌పరిధిలో సైతం వడ్డీ వ్యాపారులు, ఫైనాన్సర్‌లు ఆటో లను బలవంతంగా లాక్కుని వెళ్లి దాడులకు పాల్పడుతున్న సంఘటనలపై పోలీసులు కఠినంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని ఆయన కోరారు.


మనోనిబ్బరంతో పనిచేయాలి

▸ మల్కాజ్‌గిరి ఎంపీ అభ్యర్థి సునీతను గెలిపించాలి

▸ వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు పిలుపు


మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు


శామీర్‌పేట, మార్చి 24: పార్లమెంట్ ఎన్నికల పోరులో కాంగ్రెస్ కార్యకర్తలు రాత్రింబవళ్లు మనోనిబ్బరంతో పనిచేసి మల్కాజ్‌గిరి ఎంపీ అభ్యర్థి పట్నం సునీతామహేందర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని వ్యవసాయశాఖ మంత్రి, మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి తుమ్మల నాగేశ్వర్‌రావు పిలుపు నిచ్చారు. ఆదివారం శామీర్‌పేట మండలం తూంకుంటలోని మొగుళ్ల వెంకట్‌రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో తూంకుంట మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు జైపాల్ రెడ్డి, మేడ్చల్ నియోజవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి వజ్రేష్‌యాదవ్ ఆధ్వర్యంలో మేడ్చల్ నియోజకవర్గ కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గం నుంచి గత ఎన్నికల్లో సీఎం రేవంత్‌రెడ్డి అత్యధిక మెజార్టీతో గెలుపొంది రికార్డును సృష్టించారని గుర్తు చేశారు. ఈసారి ఎన్నికల్లో కూడా ఎంపీ అభ్యర్థి పట్నం సునీతను గెలిపించి మరోసారి రికార్డును సృష్టించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థులను చిత్తుగా ఓడించి కాంగ్రెస్ అభ్యర్థి సునీతను భారీ మెజార్టీతో గెలిపించి మల్కాజ్‌గిరి సీటును రాహుల్‌గాంధీకి కానుకగా అందించాలన్నారు. రాష్ట్రంలోని 14 పార్లమెంట్ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించేలా సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో అవినీతి కేసీఆర్ పాలనను తుంగలో తొక్కి ప్రజలకు ఉత్తమ పాలన అందిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి అభివృద్ధిలో రాష్ట్రాన్ని అగ్రగామిగా తీర్చిదిద్దడం ఖాయమన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో అంతులేని అక్రమాలు, కుంభకోణాలన్నీ బయటపడుతున్నాయని, వాటిని ప్రజలు గమనిస్తున్నారన్నారు. మల్కాజ్‌గిరి పార్లమెంట్ అభ్యర్థి పట్నం సునీతామహేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఈసారి పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు చిత్తుగా ఓడిపోయి భూస్థాపితం కావడం ఖాయమని ఛాలెంజ్ చేశారు. తన గెలుపు కోసం కార్యకర్తలు సైనికుల్లా పని చేసి సత్తా చాటాలని కోరారు. ఎన్నికల్లో పని చేసిన పార్టీ నాయకులు, కార్యకర్తలకు గుర్తింపునిస్తామన్నారు. అనంతరం డీసీసీ అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మైనంపల్లి హనుమంతరావు, సుధీర్‌రెడ్డి, జడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు నక్క ప్రభాకర్‌గౌడ్, నవీన్‌చందర్‌రెడ్డి లు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండలాల అధ్యక్షులు, వైఎస్ ఎంపీపీ శ్రీనివాస్ రెడ్డి, నాయకులు మొగుళ్ల శ్రీనివాస్ రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, బాలేష్, మధుసూదన్‌రెడ్డి, ఎద్దు నాగేశ్‌యాదవ్, ముజీబుద్దీన్, కిశోర్‌యాదవ్, లక్ష్మారెడ్డి, మేడ్చల్, కీసర, ఘట్‌కేసర్, శామీర్‌పేట మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




ఎంపీపీ ఖాజా ఇద్రిష్‌ను కాంగ్రెస్‌లో చేర్చుకుంటున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కాంగ్రెస్‌లో చేరిన ఫరూఖ్‌నగర్ ఎంపీపీ

షాద్‌నగర్ అర్బన్, మార్చి 24 : షాద్‌నగర్ బీఆర్ఎస్‌కు మరో షాక్ తగిలింది. ఫరూఖ్‌నగర్ ఎంపీపీ ఖాజా ఇద్రిష్ అహ్మద్ బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరారు. ఆదివారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ నివాసంలో పార్టీలో చేరగా ఆయన కండువా కప్పి ఇద్రిష్‌ను ఆహ్వానించారు. అలాగే ఇద్రిష్ సొంత గ్రామం చౌలపల్లి గ్రామానికి చెందిన మాజీ ఉపసర్పంచ్, మాజీ వార్డు సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు తాము చిత్తశుద్ధితో పనిచేసినా.. మైనార్టీలు పనిచేయలేదని మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ వ్యాఖ్యానించడం, బీఆర్ఎస్ నిర్వహిస్తున్న సమావేశాలకు సమాచారం ఇవ్వకపోవడంతో తాను మానసిక వేదనకు గురయ్యానని ఇద్రిష్ తెలిపారు. ఎంపీపీగా గ్రామాల అభివృద్ధి దృష్టిలో పెట్టుకుని అధికార పార్టీలో చేరినట్టు చెప్పారు. కాగా, ఆయన పార్టీలోకి రావడం సంతోషమని, సముచిత స్థానం కల్పిస్తామని ఎమ్మెల్యే శంకర్ తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జీవన్‌రెడ్డి, మహబూబ్‌నగర్ పార్లమెంట్ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డిల విజయమే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త పనిచేయాలని శంకర్ కోరారు. కార్యక్రమంలో ఫరూఖ్‌నగర్ జడ్పీటీసీ సభ్యుడు పి.వెంకట్‌రాంరెడ్డి, షాద్‌నగర్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జి.బాల్‌రాజ్‌గౌడ్, మండలాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటయ్యగౌడ్

బీజేపీ అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలి

కులకచర్ల, మార్చి 24: పార్లమెంట్ ఎన్నికల్లో చేవేళ్ల బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి గెలుపు కోసం కృషి చేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటయ్యగౌడ్ అన్నారు. చౌడాపూర్ మండల బీజేపీ ముఖ్య నాయకుల సమావేశాన్ని మండల అధ్యక్షుడు బండెయ్య ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. బూత్ కమిటీలను పూర్తిచేసి ప్రతీ బూత్‌లో కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేసి రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో అత్యధిక ఓట్లు వచ్చే విధంగా పనిచేయాలని తెలిపారు. చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని భారీమెజార్టీతో గెలిపించి నరేంద్రమోదీకి కానుకగా పంపించాలని పిలుపునిచ్చారు. ప్రతీ కార్యకర్త అబ్ కి బార్ మోదీ సర్కార్ అనే నినాదంతో ప్రతీబూత్ కార్యకర్తలు పనిచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ మోర్చా జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, మండల ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, రామాంజనేయులు, ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు చిన్న మల్లికార్జున్, కిసాన్ మోర్చా అధ్యక్షుడు మానయ్య, సీనియర్ నాయకులు పురుషోత్తం, జనార్ధన్, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు వెంకటేశం, జిల్లా కార్యవర్గ సభ్యులు మహిపాల్, యువ మోర్చా మండల అధ్యక్షుడు శరత్, ఎస్టీ మోర్చా మండల అధ్యక్షుడు పాండునాయక్, బూత్ అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా యూత్ కమ్యూనిటీ హాల్

▸ ఐదేళ్ల క్రితం అట్టహాసంగా ప్రారంభం

▸ నేడు శిథిలావస్థకు చేరుకున్న బిల్డింగ్

పూడూరు, మార్చి 24 : మండలంలోని కంకల్‌లో నిర్మించిన యూత్ భవనం, కమ్యూనిటీ హాల్ నిరుపయోగంగా మారాయి. ఐదేళ్ల క్రితం ఎంపీ నిధులు రూ.16లక్షలతో కమ్యూనిటీ హాల్‌ను నిర్మించారు. ఈ భవన నిర్మాణం పూర్తిచేసి 2-3-2019లో ఎంతో ఆర్భాటంగా ప్రారంభోత్సవం చేశారు. అప్పట్లో కమ్యూనిటీ హాల్‌ను సభలు, సమావేశాలకు బాగానే ఉపయోగించారు. రానురాను ఎవరూ పట్టించుకోకపోవడంతో కమ్యూనిటీ హాల్ కాస్త శిథిలావస్థకు చేరుకుంది. హాల్ నిర్మాణంలో భాగంగా వేసిన రేకులు విరిగిపోయి. అక్కడక్కడ గోడలు కూడా బీటలు వారాయి. దాంతో స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు మరమ్మతులు చేయించి కమ్యూనిటీ హాల్‌ను అందుబాటులోకి తెస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు.


2019లో ప్రారంభోత్సవం చేసిన శిలాఫలకం


కంకల్‌లో శిథిలావస్థకు చేరుకున్న కమ్యూనిటీ హాల్

కమ్యూనిటీ హాల్‌కు మరమ్మతులు చేయాలి



గ్రామంలో నిర్మించిన కమ్యూనిటీ హాల్ గతంలో ఎంతో ఉపయోగకరంగా ఉండేది. ప్రస్తుతం వినియోగించకపోవడంతో శిథిలావస్థకు చేరుకుంటుంది. ఏ సమావేశం నిర్వహించినా కమ్యూనిటీ హాల్‌ను ఉపయోగించుకునేవారు. ప్రస్తుతం అవకాశం లేకుండా పోయింది. అధికారులు, ప్రజాప్రతినిధులు కమ్యూనిటీ హాల్‌కు మరమ్మతులు చేయించి అందుబాటులోకి తేవాలి.

- ఎండీ అన్వర్, కంకల్ గ్రామం

దుకాణ సముదాయాన్ని నిర్మించాలని సీఎంకు వినతి



సీఎంకు వినతిపత్రం అందజేస్తున్న శ్రీనివాస్

ఆమనగల్లు, మార్చి 24 : ఆమనగల్లు చేనేత సంఘం నూతన భవన నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని, దుకాణ సముదాయాన్ని నిర్మించి చిరు వ్యాపారులను ఆదుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి వినతి పత్రం ఇవ్వగా అందుకు ఆయన సానుకూలంగా స్పందించినట్లు చేనేత సంఘం ఆమనగల్లు అధ్యక్షుడు గాజుల శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం సీఎంను హైదరాబాదులోని ఆయన నివాసంలో శ్రీనివాస్ కలిసి పుష్ప గుచ్ఛం అందజేశారు.

పద్మశాలీల సంక్షేమానికి తోడ్పాటు నందించాలి

ఆమనగల్లు, మార్చి 24 : పద్మశాలీల సంక్షేమానికి ప్రభుత్వం తోడ్పాటునందించాలని కోరగా సీఎం సానుకూలంగా స్పందించినట్లు రేవంత్ మిత్ర మండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అప్పం శ్రీనివాస్ తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డిని ఆదివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో శ్రీనివాస్ కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. పద్మశాలి కార్పొరేషన్ ఏర్పాటు చేసినందుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

మత్స్యకారులకు ప్రభుత్వ సహకారం అందించాలి



సాయికుమార్‌ను సన్మానిస్తున్న శ్రీశైలం

తలకొండపల్లి, మార్చి 24 : మత్స్యకారులకు ప్రభుత్వ పరంగా సహకారం అందించాలని కాంగ్రెస్ జిల్లా నాయకుడు, దేవుని పడకల్ మాజీ సర్పంచ్ కాడెమోని శ్రీశైలం అన్నారు. మత్స్య సహకార సంఘాల సమాఖ్య రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ సాయికుమార్‌ను ఆదివారం ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. కల్వకుర్తి నియోజకవర్గంలో మత్స్యకారుల సమస్యలను సాయికుమార్ దృష్టికి తీసుకుపోగా పరిష్కారానికి సానుకూలంగా స్పందించినట్లు శ్రీశైలం చెప్పారు. ఆయనతో భిక్షపతి ఉన్నారు.

క్రీడల పట్ల యువత ఆసక్తి



టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న రేవంత్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం, మార్చి 24 : క్రీడల పట్ల యువత ఆసక్తిని కనబర్చాలని అగర్‌మియాగూడ మాజీ ఉపసర్పంచ్ వడ్డెపల్లి రేవంత్‌రెడ్డి అన్నారు. ఆ గ్రామంలో నిర్వహించిన అగర్‌మియాగూడ ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీల(ఏపీఎల్)ను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని క్రీడాకారులు, యువత ఇలాంటి పోటీల్లో పాల్గొని వారి నైపుణ్యాన్ని ప్రదర్శించాలని చెప్పారు. నిర్వాహకులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో నాయకులు లిక్కి జంగారెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి, సిహెచ్ రవి, సంతోష్‌రెడ్డి, ప్రవీణ్‌యాదవ్, అజయ్‌యాదవ్, విష్ణుతరుణ్, శ్రీను, పాల్గొన్నారు.

కాంగ్రెస్ మున్సిపల్ ఉపాధ్యాక్షుడిగా నర్సింహయాదవ్



నియామక పత్రాన్ని అందజేస్తున్న నరేందర్

చేవెళ్ల, మార్చి 24 : కాంగ్రెస్ పార్టీ శంషాబాద్ మున్సిపల్ ఉపాధ్యాక్షుడిగా తొండుపల్లికి చెందిన నర్సింహయాదవ్‌ను నియమిస్తూ ఆ పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షుడు జల్‌పల్లి నరేందర్, మున్సిపల్ అధ్యక్షుడు సంజయ్‌యాదవ్ నియామక పత్రాన్ని ఆదివారం ఆందజేశారు. కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి డాక్టర్ రంజిత్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేస్తామని చెప్పారు. వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ పటిష్ఠత కోసం కృషి చేస్తానని నర్సింహయాదవ్ చెప్పారు. జిల్లా కార్యదర్శి పరమేష్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు జగన్, కృష్ణయ్య, తుప్పర అశోక్, రాకేష్, పాల్గొన్నారు.

కిసాన్ మోర్చా జిల్లా కార్యదర్శిగా గోపాల్‌రెడ్డి



నియామక పత్రం తీసుకుంటున్న గోపాల్ రెడ్డి

చేవెళ్ల, మార్చి 24 : కిసాన్ మోర్చా జిల్లా కార్యదర్శిగా చేవెళ్ల మండల పరిధిలోని పలుగుట్ట గ్రామానికి చెందిన పీసరి గోపాల్‌రెడ్డి నియామకయ్యారు. నగరంలో ఆదివారం కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు జక్క రవీందర్ రెడ్డి చేతుల మీదుగా ఆయన నియామక పత్రం అందుకున్నారు. తనపై నమ్మకం ఉంచి బాధ్యత అప్పగించినందుకు నమ్మకంగా రైతుల కోసం పని చేస్తానని గొపాల్‌రెడ్డి చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర నాయకుడు కంజర్ల ప్రకాశ్, జిల్లా ప్రధాన కార్యదర్శి మోర నరసింహరెడ్డి, జిల్లా కార్యదర్శి వెంకట్‌రెడ్డి, మండల అధ్యక్షుడు దేవర పాండురంగారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు కేశేపల్లి వెంకట్‌రాంరెడ్డి ఉన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



ప్రత్యేక అలంకరణలో స్వామి వారు, పూజల్లో పాల్గొన్న భక్తులు

తలకొండపల్లి/ఆమనగల్లు, మార్చి 24 : తలకొండపల్లి మండలం దేవుని పడకల్‌లోని వేంకటేశ్వర స్వామి దేవాలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమైయ్యాయి. ఎనిమిది రోజుల పాటు కొనసాగే బ్రహ్మోత్సవాల కోసం దేవాలయాన్ని పచ్చటి తోరణాలు, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. తొలి రోజు అభిషేకం, స్వస్తివాచనం, అంకురార్పణ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త లట్టుపల్లి రాజ్‌కుమార్‌రెడ్డి, ఈవో స్నేహలత, అర్చకులు గోపాలాచార్యులు, రామాచార్యులు, మాజీ సర్పంచ్ శ్రీశైలం, మాజీ ఉప సర్పంచ్ తిరుపతయ్య, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఉత్సవాలు

ఆమనగల్లు పట్టణంలోని శ్రీ వెంకటగిరి వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం వైభవంగా ముగిశాయి. బ్రహ్మోత్సవాల నేపథ్యంలో ఆలయాన్ని పచ్చటి తోరణాలు, పుష్పాలతో శోభాయామానంగా అలంకరించారు. బ్రహ్మోత్సవాలకు ఆమనగల్లుతో పాటు కడ్తాల, తలకొండపల్లి, మాడ్గుల, వెల్దండ, హైదరాబాద్ నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. ముగింపు వేడుకల్లో భాగంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకుడు గూడ కృష్ణమాచార్యులు బ్రాహ్మణులను సన్మానించారు. కార్యక్రమంలో పలువురు ప్రజా ప్రతినిధులు, నాయకులు, భక్తులు, పాల్గొన్నారు.

నేడే రంగుల పండుగ హోలీ



కందుకూరులో కామ దహనం

ఆమనగల్లు/ఇబ్రహీంపట్నం, మార్చి 24 : రంగుల పండుగ హోలీ వేడుకలను ఉత్సాహంగా జరుపుకునేందుకు కుల, మతాలకతీతంగా ప్రజలు సిద్ధమవుతున్నారు. సోమవారం హోలీ నేపథ్యంలో యువతీ, యువకులు, చిన్నారులు ఆదివారం రంగులు కొనుగోలు చేశారు. ఆదివారం రాత్రి ఆమనగల్లు, కందుకూరులో కాముని దహనానికి అన్ని గ్రామాల్లో ఏర్పాట్లు చేశారు. ఇదిలా ఉండగా హోలీ పండుగ నేపథ్యంలో సహజ సిద్ధంగా తయారు చేసిన రంగులను మాత్రమే వినియోగించాలని వైద్యులు సూచిస్తున్నారు. రసాయన రంగులు చర్మానికి హానికరమని హెచ్చరిస్తున్నారు. రసాయన రంగుల వాడనానికి దూరంగా ఉండాలని హితవు పలుకుతున్నారు. పలువురు రంగోలి సంబరాలను ప్రారంభించారు.

ప్రశాంతంగా హోలీ జరుపుకోవాలి



సీఐ రాఘవేందర్‌రెడ్డి

ఆదిభట్ల : ఇతరులకు ఇబ్బంది కలగకుండ ప్రశాంత వాతావరణంలో హోలీ జరుపుకోవాలని ఆదిభట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి ప్రజలకు సూచించారు. సోమవారం హోలీని పురస్కరించుకొని ఆదివారం ఆయన మాట్లాడుతూ రసాయనాలు లేని సాంప్రదాయ రంగులనే వినియోగించి అన్ని వర్గాల ప్రజలతో కలిసి హోలీ ఆనందంగా జరుపుకోవాలని అన్నారు. ఇతరులకు ఇబ్బంది కలిగించొద్దన్నారు. లోతైన చెరువులు, కుంటల్లో స్విమ్మింగ్ చేయకూడదని, ఇంటి వద్దనే స్నానం చేయాలని సూచించారు. ప్రార్థన మందిరాల వద్ద రంగులు చల్లుకోవడం లాంటివి చేయకూడదని చెప్పారు. ఇతరుల పట్ల అసభ్యంగా ప్రవర్తించడం, మహిళలను వేధిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు.

లోక్‌సభ ఎన్నికల్లో విజయమే లక్ష్యం



రవిని సన్మానిస్తున్న నాయకులు

ఆమనగల్లు , మార్చి 24 : లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులంతా సంఘటితంగా ముందుకు సాగాలని కాంగ్రెస్ నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ మల్లు రవి పిలుపు నిచ్చారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని, రాహుల్ ప్రధాని కావడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ఆమనగల్లు మండల నాయకులతో ఆదివారం హైదరాబాద్‌లోని తన నివాసంలో మల్లు రవి సమావేశమయ్యారు. ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై వారికి దిశా నిర్దేశం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ 14 ఎంపీ స్థానాలు కైవసం చేసుకుంటుందని చెప్పారు. దేశంలో ప్రజాస్వామ్య విలువలను బీజేపీ కాలరాస్తూ దుర్మార్గ పాలన సాగిస్తుందని రవి మండిపడ్డారు. మతం పేరుతో దేశంలో బీజేపీ అలజడులకు ఆజ్యం పోస్తోందని ఆరోపించారు. మోసపోయి బీజేపీ మరో ఓటేస్తే రాజ్యాంగానికే ప్రమాదమన్నారు. ఎంపీగా తనను ఆదరించి గెలిపించాలని కోరారు. ఆమనగల్లు మార్కెట్ కమిటీ మాజీ వైస్‌చైర్మన్, కాంగ్రెస్ జిల్లా నాయకుడు గుర్రం కేశవులు మల్లు రవిని సత్కరించారు. కార్యక్రమంలో శ్రీనునాయక్, నరేందర్‌నాయక్, లక్ష్మన్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలో ప్రజలకు కష్టాలు

● ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి



మాట్లాడుతున్న సబితాఇంద్రారెడ్డి

మహేశ్వరం, మార్చి 24 : కాంగ్రెస్ పాలనలో ప్రజలకు అప్పుడే కష్టాలు మొదలయ్యాయని, కరెంటు సమస్యతో పాటు కరువు కూడా వచ్చిందని ప్రజలు బాధపడుతున్నారని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి. సబితాఇంద్రారెడ్డి అన్నారు. ఆదివారం మహేశ్వరం నియోజకవర్గంలోని జిల్లెలగూడలోని సామ యాదిరెడ్డి గార్డెన్‌లో లోక్‌సభ ఎన్నికల సందర్భంగా బీఆర్ఎస్ చేవెళ్ల నియోజకవర్గ సన్నాహక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సబితారెడ్డి మాట్లాడుతూ రైతుబంధు, రైతుబీమా, కేసీఆర్‌కిట్, మిషన్‌భగీరథ వంటి ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తూ తెలంగాణ రాష్ట్రాన్ని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ దేశంలోనే ఆదర్శంగా నిలిపాలరన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీల తరపున చేవెళ్ల అభ్యర్థులుగా ప్రస్తుతం బరిలో ఉన్న ఇద్దరికి కేసీఆర్‌తోనే గుర్తింపు వచ్చిందన్నారు. కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, గడ్డం రంజిత్‌రెడ్డిని గత ఎన్నికల్లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కష్టపడి గెలిపించారని చెప్పారు. రంజిత్‌రెడ్డి అంటే ఎవరో కూడా తెలియని వ్యక్తిని కేసీఆర్ ఎంపీ టికెట్ ఇచ్చి గెలిపించారన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. బీఆర్ఎస్ పార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో అందరి సహాయ సహకారాలతో తనను ఎంపీగా గెలిపించి ఈ ప్రాంతానికి సేవ చేసే అవకాశం కల్పించాలన్నారు. మహేశ్వరం ప్రజల ఆశీర్వాదం కావాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు ప్రకాష్‌గౌడ్, కాలేయాదయ్య, ఎమ్మెల్సీలు సురభివాణీదేవి, యెగ్గేమల్లేషం, దయానంద్‌గుప్త, బీఆర్ఎస్ మహేశ్వరం నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తాగునీటి కోసం ఖాళీ బిందెలతో నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న కాలనీవాసులు

చేవెళ్ల, మార్చి 24 : చేవెళ్ల మండల పరిధిలోని ఆలూర్ గ్రామంలోని దళితవాడలో కొన్ని రోజులుగా నల్లానీళ్లు రావడం లేదని ఆదివారం గ్రామంలోని పలువురు మహిళలు ఖాళీ బిందెలతో ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ వాడలో కొన్ని రోజులుగా నీళ్లు రాకపోడంతో నిత్యం ఇబ్బందుల పడుతున్నామని, ప్రజా ప్రతినిధులు, అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని వాపోయారు. వేసవిలో నీటి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు. చాలా కాలం వేచి చూశాక ఆందోళన చేస్తున్నామని చెప్పారు. కాగా విషయం తెలుసుకున్న చేవెళ్ల ఎంపీడీవో, ఆలూర్ గ్రామ ప్రత్యేకాధికారి హిమబిందు స్పందించి సమస్యను పరిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆలూర్ గ్రామంలో నీటి సమస్య లేదన్నారు. దళితవాడకు సరఫరా అయ్యే మిషన్ భగీరథ పైప్‌లైన్ సీసీ రోడ్డు కింది నుంచి వెళ్లడంతో గేట్‌వాల్వ్ జాం అయిందన్నారు. ఐదారు ఇళ్లకే నీళ్లు రావడం లేదని స్పష్టం చేశారు. గేట్‌వాల్ రిపేర్ అయ్యేవరకు వాటర్ ట్యాంకర్ ద్వారా నీటిని అందిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ వెంకటయ్య, కాలనీవాసులు ఉన్నారు.

కాంగ్రెస్ పార్టీతోనే తెలంగాణ అభివృద్ధి



కాంగ్రెస్‌లో చేరుతున్న లింగారెడ్డిగూడ గ్రామస్థులు

షాబాద్, మార్చి 24 : కాంగ్రెస్ పార్టీతోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమవుతుందని ఆ పార్టీ చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్ అన్నారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో చేవెళ్ల నియోజకవర్గంలో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించేందుకు కృషిచేస్తామని చెప్పారు. ఆదివారం మండల పరిధిలోని లింగారెడ్డిగూడ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ మాజీ ఉపసర్పంచ్ గట్టుపల్లి ఎల్లేష్ తన అనుచరులతో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కండువాలు కప్పి భీంభరత్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వివిధ పార్టీల నాయకులు తమ పార్టీలో చేరుతున్నారని అన్నారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు పెంటారెడ్డి, నాయకులు బర్ల యాదయ్య, సబ్బిగారి రాజు, జంగయ్య, రవి, మల్లేష్, కృష్ణ, శ్రీను, నరేందర్, సంజీవ, విజయ్ తదితరులు ఉన్నారు.

లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యం



అనిల్‌ను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

షాద్‌నగర్, మార్చి 24 : రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కమ్మరి భూపాలచారి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఆర్యసమాజ్ ఆవరణలో మండలాధ్యక్షుడు కురుమయ్య ఆధ్వర్యంలో కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నరేంద్ర మోదీ ప్రభుత్వం మూడోసారీ కొలువు దీరుతుందని, ఉమ్మడి పాలమూరులో లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి డీకే అరుణ గెలవడం ఖాయామని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల ప్రధాన కార్యదర్శిగా అనిల్‌కుమార్, కిసాన్ మోర్చా అధ్యక్షుడిగా వెంకటేష్, ఉపాధ్యక్షుడిగా రాములను ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో యాదయ్య, రాజు, భీమయ్య, రామ్ లక్ష్మణ్, కృష్ణయ్య, యాదగిరి పాల్గొన్నారు.

అవినీతి రహిత పాలనే లక్ష్యం



మేనిఫెస్టో విడుదల చేస్తున్న సూర్యప్రకాశ్‌రెడ్డి

చేవెళ్ల, మార్చి 24 : ప్రజలకు అవినీతి రహిత పాలన అందించడమే తన లక్ష్యం అని సివిల్ ఇంజనీర్ సూర్యప్రకాశ్‌రెడ్డి తెలిపారు. ఆదివారం చేవెళ్ల మండల కేంద్రంలో తన ఎన్నికల మేనిఫెస్టో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీకి దిగుతున్నట్లు చెప్పారు. ప్రజలకు సుపరిపాలన, సత్వర న్యాయం అందించాలన్న లక్ష్యంతో తాను రాజకీయాల్లోకి వచ్చానన్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మహేశ్వరం నియోజకవర్గం నుంచి పోటీ చేశానని, లోక్‌సభ ఎన్నికల్లోనూ పోటీ చేస్తానని చెప్పారు. రైతు బిడ్డనైన తనకు ప్రజా సమస్యలు తెలుసన్నారు. దేశం అభివృద్ధి పథంలో ముందుకు సాగాలంటే అవినీతి రహిత పాలనతో పాటు వివిధ రంగాల్లో సంస్కరణలు అవసరమని చెప్పారు. లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు తనను ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు సురేష్, శ్రీనివాస్, ఆదిత్యరాజ్ ఉన్నారు.

ప్రతీ ఒక్కరు చూడాల్సిన సినిమా.. రజాకార్



థియేటర్ వద్ద నిల్చున్న బీజేపీ నాయకులు

షాద్‌నగర్‌అర్బన్, మార్చి 24 : నిజాం నిరంకుశ పాలనలో తెలంగాణ ప్రజలపై రజాకర్లు చేసిన దురాఘాతాలను అద్దం పట్టేలా చిత్రీకరించిన రజాకార్ సినిమాను ప్రతీ తెలంగాణ పౌరుడు చూడాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి, అందె బాబయ్య పిలుపునిచ్చారు. బీజేపీ మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి డీకె అరుణ ఆర్థిక సహకారంతో ఆదివారం షాద్‌నగర్ రామకృష్ణ థియేటర్‌లో ప్రదర్శించిన రజాకార్ మ్యాట్నీషోను బీజేపీ నాయకులు తిలకించారు. అనంతరం వారు మాట్లాడుతూ నాటి కేంద్ర హోంశాఖ మంత్రి సర్దార్ వల్లభాయ్‌పటేల్ తెగువతో తెలంగాణకు నిజాం నుంచి విమోచన కలిగిందని అన్నారు. బీజేపీ నాయకులు దేపల్లి అశోక్‌గౌడ్, కక్కునూరి వెంకటేష్‌గుప్త, కమ్మరి భూపాలాచారి, వంశీకృష్ణ, చెట్ల వెంకటేష్, నందిగామా వెంకటేష్ తిలకించారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

కడ్తాల్, మార్చి 24 : మండల పరిధిలోని మైసిగండి గ్రామానికిచెందిన జటావత్ గౌరియానాయక్ అనారోగ్యంతో మృతి చెందగా అతని కుటుంబాన్ని ఆదివారం బీజేపీ జిల్లా నాయకుడు రాందాస్ నాయక్ పరామర్శించారు. బాధిత కుటుంబానికి రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. జగన్‌నాయక్, పాండునాయక్, జవహర్‌లాల్‌నాయక్, కుమార్, మురళి, తదితరులు ఉన్నారు.

క్రైం కార్నర్

లారీని ఢీకొని వ్యక్తి దుర్మరణం

కొందుర్గు, మార్చి 24 : లారీని ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని చెక్కలోనిగూడెంలో జరిగింది. ఎస్సై కృష్ణయ్య కథనం మేరకు.. చెక్కలోనిగూడెం గ్రామానికి చెందిన బొప్పల రాంచంద్రయ్య(54) ఆదివారం ఉదయం 11 గంటలకు తన గ్రామం నుంచి కొందుర్గుకు అతని ద్విచక్రవాహనంపై వస్తున్నాడు. మార్గమధ్యలో రోడ్డుపై ఆగి ఉన్న ఓ లారీని వెనుక నుంచి ఢీకొట్టడంతో, రాంచంద్రయ్య అక్కడికక్కడే దుర్మరణం పాలైనట్లు ఎస్సై తెలిపారు. మృతునికి భార్య సైదమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు. సైదమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వేడి నూనె పడి బాలుడి మృతి

ఆమనగల్లు, మార్చి 24 : వేడి నూనె మీద పడి ఓ బాలుడు మృతి చెందిన సంఘటన ఆమనగల్లు పట్టణంలో చోటు చేసుకుంది. ఎస్సై బాల్‌రామ్‌నాయక్, బాలుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలం బండోని పల్లి గ్రామానికి చెందిన ఆకుల అర్జున్ జాతర్లలో తినుబండారాలు అమ్ముతూ జీవనం సాగిస్తున్నాడు. ఆమనగల్లు పట్టణంలోని వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో శనివారం ఉదయం తినుబండారాలు తయారు చేస్తుండగా ప్రమాదవశాత్తు పొయ్యిపై ఉన్న వేడి నూనె ఆకుల జయదేవ్(3) పడింది. తీవ్రంగా గాయపడిన జయదేవ్‌ను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం హైదరాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ జయదేవ్ ఆదివారం మృతి చెందాడు. ఈ మేరకు కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బాల్‌రామ్‌నాయక్ తెలిపారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

షాద్‌నగర్, మార్చి 24 : కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన షాద్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని వెలిజర్లలో జరిగింది. పోలీసులు, గ్రామస్థుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన మహేశ్వరం రామకృష్ణ(35) అదే గ్రామానికి చెందిన అరుణను గతంలో ప్రేమ వివాహం చేసుకున్నాడు. వారికి ఇద్దరు పిల్లలున్నారు. వారి మధ్య కుటుంబ వ్యవహారాల్లో తరచూ గొడవలు జరుగుతుండేవి. గురువారం కూడా ఇద్దరి మధ్య గొడవ జరగడంతో ఆ రోజు సాయంత్రం రామకృష్ణ ఇంటి నుంచి వెళ్లి పోయాడు. గ్రామ శివారులో ఉన్న ఓ మామిడి తోటలో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదివారం తోటలోకి పని కోసం వెళ్లిన వారు అతను చనిపోయి ఉండటాన్ని చూసి గ్రామస్థులకు చెప్పారు. వారు సమాచారం ఇవ్వడంతో అక్కడికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని షాద్‌నగర్ కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై రాంచంద్రయ్య తెలిపారు.

సెంట్రింగ్ బాక్సలను చోరీ ముఠా అరెస్టు

ముగ్గురు నిందితులకు రిమాండ్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ రాఘవేందర్‌రెడ్డి

ఆదిభట్ల, మార్చి 24 : ఇంటి నిర్మాణం కోసం తెచ్చిన సెంట్రింగ్ బాక్స్‌లను దొంగిలించే ముఠా సభ్యులను ఆదివారం ఆదిభట్ల పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.1 లక్ష 85 వేలు నగదు, ఓ బైకును స్వాధీనం చేసుకున్నారు. ఆదిభట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 22, 23న రాగన్నగూడ, మన్నెగూడ, రావిరాలలో ఇళ్ల నిర్మాణం కోసం తెచ్చిన సెంట్రింగ్ బాక్స్‌లు అపహరణకు గురికావడం జరిగింది. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కాగా 23న (శనివారం) మన్నెగూడ వద్ద పోలీసు తనిఖీ చేస్తుండగా ముగ్గురు వ్యక్తులు ఓ బైక్‌పై వస్తూ అనుమానస్పదంగా కనిపించారు. పోలీసులను చూసి ఏపీ 22 ఏఎఫ్ 0732 నెంబరుగల హోండా షూన్ బైకుపై వారు పారిపోవడానికి ప్రయత్నించారు. ఎస్సై వెంకటేష్ ఆధ్వర్యంలో పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని విచారించగా మూడు చోట్ల సెంట్రింగ్ బాక్స్‌ల దొంగతనంతో పాటు ఒకతను 19, మరొకతనికి 2పాత కేసులతో సంబంధం ఉన్నట్లు ఒప్పుకోవడం జరిగింది. వారి నుంచి బైక్‌తో పాటు రూ.1లక్ష85 వేలు నగదు స్వాధీనం చేసుకొన్నారు. నిందితులు బహదూర్‌పురాలోని కిషన్‌బాగ్‌కు చెందిన మహమ్మద్ నసీర్ అలీ (40) (గతంలో 19 కేసులతో సంబంధం ఉన్న పాత నేరస్తుడు) ముషీరాబాద్‌లోని బోలక్‌పూర్‌కు చెందిన మహమ్మద్ ఫయాజ్ (19) (గతంలో రెండు పాత కేసులతో సంబంధం ఉన్న పాత నేరస్తుడు) సంగారెడ్డి జిల్లా సిరిగాపూర్ మండలం ముబారక్ పూర్ గ్రామానికి చెందిన వక్కరేణి కుమార్ (36)ను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. దొంగతనాలకు పాల్పడుతున్న నేరస్తులను చాకచక్యంగా పట్టుకున్న ఎస్సై వెంకటేష్‌తోపాటు సిబ్బందిని సీఐ ప్రశంసించారు.


రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మహేశ్వరం, మార్చి 24 : రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం రాత్రి మహేశ్వరం పోలీసుస్టేషన్ పరిధిలో జరిగింది. మహేశ్వరం ఎస్సై రవిందర్ తెలిపిన వివరాల ప్రకారం సంఘటన వివరాలిలా ఉన్నాయి. నగరంలోని చంద్రయాణగుట్టకు చెందిన మహ్మద్‌తాహీర్(50) తన ఆటోలో ఆదివారం రాత్రి కందుకూరు నుంచి హైదరాబాదుకు వెళుతుండగా శ్రీశైలం - హైదరాబాదు ప్రధాన రహదారిలోని బీటీఆర్ వద్ద ఎదురుగా వచ్చిన డీసీఎం వ్యాను ఆటోను బలంగా ఢీకొట్టడంతో ఆటోలో ఉన్న మహ్మద్‌తాహీర్ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచరం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని తాహీర్ మృతదేహాన్ని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బెల్టు షాపులు నడిపితే కఠిన చర్యలు

యాచారం, మార్చి 24 : గ్రామాల్లో బెల్టు షాపులు నడిపే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని యాచారం హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ సీఐలు శంకర్‌కుమార్, నర్సింహారావు అన్నారు. రెండు పోలీస్‌స్టేషన్ల పరిధిలో రూ.21 వేల విలువైన అక్రమ మద్యాన్ని ఆదివారం స్వాధీనం చేసుకున్నట్లు వారు తెలిపారు. సారా విక్రయించే వారిపై చట్ట పరంగా కఠిన చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించరాదని ప్రజలకు సూచించారు. మైనర్లు వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామన్నారు. రూ.50వేలకు మించి డబ్బు ఉంటే అందుకు తగిన ఆధారాలు చూపాలని, లేదంటే సీజ్ చేస్తామన్నారు. గ్రామాల్లో అక్రమ మద్యం విక్రయిస్తే తమకు సమాచారమందించాలని వారు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.

తల్లీకూతుళ్ల అదృశ్యం



స్వాతి, ఆరాధ్య, యశ్విత ఫైల్ ఫోటో

చేవెళ్ల, మార్చి 24 : తల్లి, పిల్లలు అదృశ్యమైన సంఘటన ఆదివారం శంషాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం మండల పరిధిలోని చౌదరి గూడ గ్రామానికి చెందిన కుమ్మరి రమేష్‌కు పది సంవత్సరాల క్రితం ఊట్‌పల్లికి చెందిన కుమ్మరి స్వాతితో వివాహం జరిగింది. వీరికి ఆరాధ్య(7), యశ్విత(5) అనే పిల్లలున్నారు. కొన్ని నెలలుగా వారి మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఇటీవల స్వాతి తన తల్లిదండ్రుల ఇంట్లో పిల్లలతో కలిసి ఉంటూ, కిరాణ షాప్ నడుపుతోంది. శనివారం తన ఇద్దరు ఆడపిల్లలతో కలిసి ఇంట్లో పడుకున్న ఆమె ఆదివారం ఉదయం 7 గంటలకు లేచి ఆమె తల్లి చూడగా కనిపించడలేదు. స్నేహితులు, బంధువుల ఇంట్లో ఆమె తల్లి రమాదేవి ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో ఆదివారం శంషాబాద్ పోలీస్‌స్టేషన్‌లో రమాదేవి ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.